క్లుప్తంగా

అయ్యప్పకు పూజలు



జంగారెడ్డిగూడెం: గురవాయిగూడెంలో వేంచేసిన శ్రీ హరిహర సుత అయ్యప్ప స్వామి దేవస్థానంలో సోమవారం స్వామివారి జన్మనక్షత్రమైన ఉత్తరా నక్షత్రం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. చవితి రోజు నుంచి అయ్యప్ప స్వామి భక్తులకు మాలధారణలో దేవస్థానంలో జరుగుతాయని ట్రస్టు సభ్యులు తెలిపారు. ప్రెసిడెంట్ చిన్నివాసు స్వామి, కోశాధికారి కూనా పార్వతి, నెక్కలపూడి సూర్యచంద్రరావు, బాకి శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగురాలికి సహాయం



దివ్యాంగురాలు గుర్రం శాంతికి వీల్‌చైర్‌ను అందజేస్తున్న మానవత సభ్యులు

జంగారెడ్డిగూడెం: మానవత ఆధ్వర్యంలో దాత సహకారంతో దివ్యాంగురాలికి వీల్ చైర్‌ను అందజేశారు. సోమవారం పట్టణంలో మానవత మండల చైర్మన్ ఆకుల ధర్మరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కొత్తపేటకు చెందిన దివ్యాంగురాలు గుర్రంశాంతికి దాత సుధాలక్ష్మి వీల్‌చైర్‌ను అందజేశారు. మహమ్మద్ అన్వర్ పాషా జ్ఞాపకార్థం వీల్‌చైర్‌ను అందించినట్లు దాత తెలిపారు. మానవతా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

నేడు అచ్చియ్యపాలెంలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ

బుట్టాయగూడెం: మండలంలోని అచ్చియ్యపాలెంలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు తెలిపారు. సాయంత్రం 4 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మాజీ మార్కెట్ డైరెక్టర్లు అందరూ పాల్గొనాలని కోరారు.

సెల్ సిగ్నల్ లేక ఆధార్ నమోదు కష్టాలు



దొరమామిడిలో ఆధార్ నమోదు కోసం కొండ దిగి వచ్చిన గిరిజనులు

బుట్టాయగూడెం: ఆయుష్మాన్ భారత్ నమోదుకు గిరిజన గ్రామాల్లో సరైన సెల్ సిగ్నల్ లేక గిరిజనులు అనేక అవస్థలు పడుతున్నారు. మండలంలోని మారుమూల గ్రామమైన వీరమద్దిగూడెం గ్రామానికి చెందిన గిరిజనులు ఆయుష్మాన్ భారత్ నమోదుకు సిగ్నల్ లేకపోవడంతో దొరమామిడి సచివాలయంకు ఆటోపై వచ్చి ఆధార్ నమోదు చేసుకున్నారు. అయితే ప్రతి గ్రామంలో నమోదు చేసుకోవాల్సి ఉండగా అక్కడ సిగ్నల్ లేకపోవడం వల్ల గిరిజనులే సొంత ఖర్చులతో దొరమామిడి వరకూ వచ్చి నమోదు చేసుకున్నారు.

ఉపాధి కూలీలకు సొమ్ములు చెల్లించాలి



ఏపీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేత

కొయ్యలగూడెం: ఉపాధి కూలీలకు వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం సీపీఎం శ్రేణులు, ఉపాధి కూలీలు స్థానిక ఏపీవో కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. గవరవరం గ్రామపంచాయతీలో ఉపాధి కూలీలకు పది వారాల సొమ్ములు చెల్లించాలని, అలాగే నాలుగైదు వారాలు పనులు నిలిపివేశారన్నారు. ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శుక్రబోయిన రాంబాబు మాట్లాడుతూ ఉపాధి కూలీల సమస్యలను పరిష్కరించాలని కోరారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రం కార్యాలయ అధికారికి సమర్పించారు.

మోజెస్‌కు సన్మానం



మోజెస్‌ను సత్కరిస్తున్న విజయానంద్

చింతలపూడి: ఏలూరు శ్రీ కళావేదిక నిర్వహించిన పాటల పోటీల్లో స్వర కిరీటి బిరుదును సాధించిన ఎం బ్లెస్సింగ్ మోజెస్‌ను దాసోహం ఆర్ట్స్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. చిల్లపల్లి కాంప్లెక్స్ వద్ద సోమవారం దాసోహం వీరభద్రాచారి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బ్లెస్సింగ్ మోజెస్‌ను కేరళ మాజీ డీజీపీ పూరేటి విజయానంద్, ఎండీ అక్బర్ ఆలి దుశ్శాలువాతో సన్మానించారు. సంస్థ నిర్వాహకులు డి.వీరభద్ర చారి, ఆనంద్, ఇమ్మానుయేల్, అలెగ్జాండర్ తదితరులు పాడిన పాటలు ఆహ్వానితులను అలరించాయి.

చవితి వేడుకలకు శరవేగంగా ఏర్పాట్లు



ద్వారకాతిరుమలలో వినాయక ప్రతిమను కొనుగోలు చేస్తున్న దృశ్యం



బుట్టాయగూడెంలో మట్టి విగ్రహాల పంపిణీ



పోలవరంలో ఘాట్‌లను పరిశీలిస్తున్న సీఐ బాల సురేష్‌బాబు



కొయ్యలగూడెం మండలం కన్నాపురంలో రాట వేస్తున్న దృశ్యం

- రేపు కొలువు తీరనున్న గణేష్ విగ్రహాలు
- భారీగా ఏర్పాట్లు చేస్తున్న ఉత్సవ కమిటీలు

ద్వారకాతిరుమల: గణేష్ నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయి. గ్రామ గ్రామాన గణేష్ మందిరాలు ముస్తాబవుతున్నాయి. కమిటీ సభ్యులు వాటిని ఆకర్షణీయంగా అలంకరిస్తున్నారు. ఈనెల 27న వినాయక చవితి పండుగను పురస్కరించుకుని, గణనాధుల భారీ విగ్రహాలు వాటిలో కొలువు తీరనున్నాయి. ద్వారకాతిరుమలలోనే 13 ప్రాంతాల్లో ఈ నవరాత్రి ఉత్సవాలను జరిపేందుకు కమిటీ సభ్యులు చురుగ్గా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ పనులు తుది దశకు చేరుకున్నాయి. ఏలూరు, జంగారెడ్డిగూడెం తదితర పట్టణాల్లో కొనుగోలు చేసిన వినాయక విగ్రహాలను కొందరు లారీలు, ఆటోలు వివిధ వాహనాల్లో సోమవారం తమ గ్రామాలకు తరలించారు. ఇదిలా ఉంటే ద్వారకాతిరుమలలోని పసరు కోనేరు వద్ద గణేష్ మట్టి ప్రతిమలు, పాలవెల్లుల విక్రయాలు ప్రారంభమయ్యాయి.

ఉత్సవాలకు శ్రీకారం

కొయ్యలగూడెం: కన్నాపురంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామి వారి వినాయక చవితి ఉత్సవాలకు సోమవారం శ్రీకారం చుట్టారు. గణపతి నవరాత్రులు మహోత్సవాల సందర్భంగా పందిరి రాట వేశారు. చవితి వేడుకలకు కొయ్యలగూడెం నుంచి భారీగా గణనాధుల విగ్రహాలు తరలివెళ్లాయి. కాగా సెప్టెంబర్ 7వ తేదీ చంద్రగ్రహణం ఉండడం వలన ఆరవ తేదీ లోపు స్వామివారి ఉత్సవ ఊరేగింపు నిమజ్జనోత్సవ కార్యక్రమాలు పూర్తి చేసుకోవాలని కాన్వ విద్యాపీఠాధిపతి బ్రహ్మశ్రీ అని పెద్ది వెంకట నరసింహ శర్మ సూచించారు.

అనుమతులు తీసుకోవాలి

పోలవరం రూరల్: మండలంలో వినాయక చవితి విగ్రహాలు ఏర్పాటుచేసే నిర్వాహకులు ముందుగా పోలీసుల అనుమతి తీసుకోవాలని సీఐ బాల సురేష్‌బాబు, ఎస్సై పవన్‌కుమార్ సూచించారు. వినాయక నిమజ్జనానికి సంబంధించి గోదావరి నది ఘాట్‌లను వారు పరిశీలించారు. నిమజ్జనాల్లో ఘాట్‌ల వద్ద ప్రమాదాలు జరగకుండా ఫ్లెక్సీలు ఏర్పాటుచేశారు. నిర్దేశించిన ఘాట్‌లలో మాత్రమే నిమజ్జనం నిర్వహించాలని ఆ ప్రాంతంలో పోలీసుల గస్తీ ఏర్పాటు చేస్తామన్నారు.

మట్టి గణపతుల పంపిణీ

బుట్టాయగూడెం: స్థానిక విద్యారోహిణీ పాఠశాలలో 350 వినాయకుని ప్రతిమలను ఆ పాఠశాల ప్రిన్సిపాల్ కొండేపాటి రామకృష్ణ, నీలిమ దంపతుల చేతుల మీదుగా విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మట్టిగణపతులను పూజించి పర్యావరణాన్ని కాపాడాలన్నారు. కార్యక్రమంలో భరత్ తేజ, తదితరులు పాల్గొన్నారు. రెడ్డిగణపవరంలో అల్లూరి సీతారామరాజు యూత్, ఎస్‌కేడీ ఈవెంట్స్ ఆధ్వర్యంలో మంగళవారం వినాయకుని మట్టి ప్రతిమలను ఉచింతగా పంపిణీ చేయనున్నట్లు ఆ సంఘ ప్రతినిధి జి.పవన్ కుమార్ తెలిపారు. స్థానిక బస్టాండ్ సమీపంలో సుమారు 500 మట్టి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేస్తామన్నారు.

స్త్రీ శక్తి పథకంలో లొసుగులు సరిదిద్దుకోవాలి

మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు డిమాండ్



కొయ్యలగూడెం: మంగపతిదేవి పేటలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమం



చింతలపూడి: రేచర్లలో క్యూ ఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న పార్టీ నేతలు

కొయ్యలగూడెం: స్త్రీ శక్తి పథకంలో ఉన్న లొసుగులు కూటమి ప్రభుత్వం సరిదిద్దుకొని మహిళలందరికీ సమన్యాయం చేయాలని మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు డిమాండ్ చేశారు. సోమవారం మంగపతిదేవి పేట గ్రామంలో మాజీ సర్పంచ్ ఎంపీటీసీ తేలే శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమానికి ఆయన సారథ్యం వహించారు. స్త్రీ శక్తి పథకం పూర్తి స్థాయిలో అమలు చేయాలంటే ఇప్పుడు ఉన్న ఆర్టీసీ బస్సులకు తోడు మరో 2,500 బస్సులు అవసరమవుతాయని కూటమి ప్రభుత్వానికి నివేదికలు వెళ్లినా దానిని అమలు చేయకుండా ఆర్భాటానికి స్త్రీ శక్తి పథకాన్ని అమలు చేస్తున్నారన్నారు. దీనివలన బస్సుల్లో మహిళల కొట్లాటలు ఇతర ప్రయాణికుల ఇబ్బందులు నిత్యం కొనసాగుతున్నాయన్నారు. పల్లె వెలుగు బస్సులు సైతం కొన్ని స్త్రీ శక్తి పథకానికి వర్తించవంటూ బోర్డులు పెట్టడం, ఆర్టీసీ సిబ్బందితో ప్రయాణికుల వద్ద దాటవేత వైఖరి అవలంభించడం పరిపాటిగా మారిందన్నారు. పాలనలోకి వచ్చిన సంవత్సర కాలంలో ఘోరంగా విఫలమైన కూటమి ప్రభుత్వం ప్రజా వ్యతిరేకతను గమనించిందన్నారు. దీంతో రైతాంగానికి ముఖ్యమైన సహకార సంఘాల ఎన్నికలను నిర్వహించలేకపోతుందన్నారు. ఖరీఫ్ సీజన్‌లో వ్యవసాయానికి సరిపడా యూరియా లేకపోవడం ప్రభుత్వం అసమర్థతకు నిదర్శనం అన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి దాసరి విష్ణు, మండల కన్వీనర్ తుమ్మలపల్లి గంగరాజు, పార్టీ శ్రేణులు గంటా శ్రీను, చిడిపి వెంకటరావు, జక్కు గోపాలం, పి.వెంకటేష్, చిడిపి రవి, నూకల రాము, గంటా రమేష్, కంభంపాటి బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు.

కూటమి పాలన మోసాల మయం

చింతలపూడి: కూటమి ప్రభుత్వ ఏడాది పాలన మోసాల మయమని వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షురాలు జగ్గవరపు జానకి రెడ్డి అన్నారు. సోమవారం రేచర్ల గ్రామంలో వైఎస్సార్ సీపీ గ్రామ విస్తత స్థాయి సమావేశం పార్టీ మండల అధ్యక్షుడు ఎస్ రమేష్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించి క్యూ ఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జానకి రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల ముందు అనేక వాగ్దానాలు ఇచ్చి మొసలీ కన్నీరు కార్చిన చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమ పథకాలను పూర్తిగా అమలు చేయకుండా ప్రజలకు వెన్నుపోటు పొడిచారని విమర్శించారు. ప్రజల తరుపున ప్రశ్నిస్తే అక్రమ కేసులు బనాయించి వేధింపులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. కూటమి 15 నెలల పరిపాలనలో లక్షల కోట్లు అప్పులు చేసి రాష్ట్రాన్ని దివాళ చేశారని అన్నారు. నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ బలోపేతంపై దృష్టి సారించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు శీలపు రెడ్డి రమేష్ రెడ్డి, జెడ్పీటీసీ ఎం నీరజ సుధాకర్ , ఎంపీపీ డాక్టర్ బి రాంబాబు నాయక్, సర్పంచ్ కె శివరామకృష్ణ, తుమ్మూరు వెంకటరామిరెడ్డి, బుల్లా దాసు, నరసింహారావు, పి శివ, మాధవరావు, గోపాలకృష్ణ, అప్పయ్య, భూపతి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేసుల నమోదు

పోలవరం రూరల్: పోలవరం పంచాయతీ పరిధిలోని పాత పోలవరంలో రెండు కుటుంబాల మధ్య ఏర్పడిన ఘర్షణ కొట్లాటకు దారితీసింది. ఎస్సై ఎస్ఎస్ పవన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం మేడూరి వెంకన్నబాబు, పోలవరపు గంగాభవానీ కుటుంబాల మధ్య ఉన్న తగాదాల నేపథ్యంలో ఇరువర్గాల మధ్య ఘర్షణలు జరిగినట్లు, ఇరువురు ఇచ్చిన ఫిర్యాదులతో కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. ఇరువర్గాలు ఆదివారం రాత్రి గొడవ పడిన ఘటనలో వారికి స్వల్ప గాయాలయ్యాయన్నారు.

మహిళలకు ఉచిత శిక్షణ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో వివిధ కోర్సుల్లో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్టు ఆ సంస్థ డైరెక్టర్ ఎం ఫణి కిషోర్ ఒక ప్రకటనలో తెలిపారు. మహిళలకు టైలరింగ్‌లో 31 రోజులు, జూట్ బ్యాగ్స్ తయారీలో 14 రోజుల పాటు శిక్షణ ఏలూరు, సత్రంపాడులోని తమ సంస్థ కార్యాలయంలో ఈ నెల 28 నుంచి ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. 18 నుంచి 45 సంవత్సరాల మధ్య వయసు గల గ్రామీణ ప్రాంత నిరుద్యోగ మహిళలు అర్హులని, శిక్షణా సమయంలో భోజనం, హాస్టల్ వసతి ఉచితమని తెలిపారు. వివరాలకు 99485 65256, 95330 79471, 95027 23561లో సంప్రదించాలన్నారు.

సీలింగ్ భూములను పేదలకు పంచాలి



ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న పేదలు, నవ్యాంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం నాయకులు

జంగారెడ్డిగూడెం: సీలింగ్ భూములను పేదలకు పంచాలని డిమాండ్ చేస్తూ నవ్యాంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం నాయకులు స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐఎంఎల్ రెడ్‌స్టార్ జిల్లా ప్రధాన కార్యదర్శి జొన్నకూటి వెంకటేశ్వరరావు మాట్లాతూ జంగారెడ్డిగూడెం మండలం పంగిడిగూడెం, కొయ్యలగూడెం మండలం బుల్లింపేట గ్రామాల్లో ఉన్న సీలింగ్ భూముల కోసం దశాబ్దాల కాలంగా పోరాటం చేస్తున్నా, సదరు భూములపై కోర్టుల ఉత్తర్వుల ఉన్నా అధికారులు స్పందించడం లేదన్నారు. కార్యక్రమంలో నవ్యాంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం రాష్ట్ర కోకన్వీనర్ డి.రంగనాధం, ఆదివాసీ భారత మహాసభ రాష్ట్ర కార్యదర్శి మడకం రామన్న, మండల పల్లరాజు, మట్టపర్తి వెంకట్రావు, గంజి శ్యామల, పూసం దురగ తదితరులు పాల్గొన్నారు.

ఇష్టానుసారంగా చెట్ల నరికివేత



పాశ్వానగరంలో రోడ్డు వెంబడి చెట్లను నరికివేస్తున్న దృశ్యం



నరికిన కలపన ట్రాక్టర్లపై లోడ్ చేసి తరలిస్తున్న దృశ్యం

లింగపాలెం: మండలంలోని రంగాపురం నుంచి చింతలపూడి వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారిలో కె.గోకవరం, పాశ్వానగరం మధ్యలో నూతన కరెంట్ స్తంభాలు వేసేందుకు రోడ్డుకి ఇరువైపులా ఉన్న పచ్చని చెట్లను ఇష్టానుసారంగా నరికివేస్తున్నారు. టన్నుల కొద్ది కలపను నిమిషాల వ్యవధిలో ట్రాక్టర్లలో లోడు చేసి తరలిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. అన్ని చెట్లు నరకడానికి వారికి పర్మిషన్ ఎవరు ఇచ్చారన్నది ఆ రోడ్డులో ప్రయాణం చేసేవారి సందేహం. ఓ వైపు ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి మొక్కలు నాటుతుంటే రహదారి పక్కన ఉన్న పచ్చని చెట్లను కరెంట్ స్తంభాల కోసం ఇష్టమొచ్చినట్లు నరుకుతుంటే ఆర్‌అండ్‌బీ అధికారులు నిమ్మకునీరేత్తినట్లు వ్యవహరిస్తున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రైతు సమస్యల పరిష్కారానికి సమష్టి కృషి



రైతులతో మాట్లాడుతున్న డీసీసీబీ మాజీ చైర్మన్ కరాటం రాంబాబు

కొయ్యలగూడెం: రైతు సమస్యల పరిష్కారానికి అఖిలపక్ష రాజకీయ పార్టీల సమష్టి కృషి అవసరం అని డీసీసీబీ మాజీ చైర్మన్ కరాటం రాంబాబు పేర్కొన్నారు. సోమవారం కొయ్యలగూడెంకి విచ్చేసిన ఆయనకు పరింపూడి పంచాయతీ పరిధిలో ఉన్న రైతులు తమ సాధక, బాధలు వెళ్లబుచ్చారు. రైతు సంఘాన్ని ఏర్పాటు చేయాలని, రైతులందరికీ సరిపడా యూరియా సరఫరాకు కృషి చేయాలని కోరారు. అదేవిధంగా కొయ్యలగూడెం గ్రామదేవత శ్రీచింతాలమ్మ అమ్మవారి ఆలయ కమిటీలో రైతులకు అధిక ప్రాధాన్యత ఇచ్చేలా గ్రామ పెద్దలను సమన్వయం చేయాలని కరాటాన్ని అభ్యర్థించారు. ఈ సందర్భంగా రాంబాబు డీసీఎంఎస్ అధికారులతో మాట్లాడి యూరియా కొరత లేకుండా చూడాలన్నారు. గ్రామాభివృద్ధికి రైతులతో కలసి నడుచుకోవాలని అఖిలపక్ష రాజకీయ పార్టీల నాయకులకు సూచించారు. సన్న చిన్న కారు రైతులకు ప్రాముఖ్యతనివ్వాలి అని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు మేకల అన్నవరం, మట్టా సత్తిపండు, కూటమి నాయకులు పాల్గొన్నారు

పీజీఆర్ఎస్‌లో 20 అర్జీలు

జంగారెడ్డిగూడెం: స్థానిక ఆర్డీవో కార్యాయలంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో 20 అర్జీలు వచ్చినట్లు ఆర్డీవో ఎంవీ రమణ తెలిపారు. ఎక్కువగా భూ సంబంధిత సమస్యలపై అర్జీలు అందాయన్నారు. సమస్యలను ఆయా శాఖల అధికారులకు ఎండార్స్ చేయడం జరిగిందన్నారు. సమస్యలను ఆమోదయోగ్యమైన రీతిలో పరిష్కరించాలని అధికారులను ఆర్డీవో ఆదేశించారు.

యూరియా కొరత రాకుండా చర్యలు



యర్రగుంటపల్లిలో పురుగు మందుల దుకాణాలను తనిఖీ చేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి

చింతలపూడి: రైతులకు యూరియ కొరత రాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ బాషా తెలిపారు. మండలంలోని యర్రగుంటపల్లి గ్రామంలో ఎరువులు, పురుగు మందుల దుకాణాలను సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. యూరియ పంపిణీలో వరి రైతులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వావలని ఆయన వ్యాపారులను ఆదేశించారు. ఎరువుల దుకాణాల్లో రికార్డులను పరిశీలించారు. యూరియ స్టాక్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు యూరియాను నిల్వ పెట్టుకోవద్దని సూచించారు. పాస్ పుస్తకాల ఆధారంగా ప్రతి రైతుకు రెండు బస్తాల యూరియ మాత్రమే విక్రయించాలని చెప్పారు. ఆయన వెంట వ్యవసాయ శాఖ ఏడీ వై సుబ్బారావు, ఏఓ మురళీకృష్ణ ఉన్నారు.

లింగపాలెం: మండలంలోని ఎరువుల షాపులు, గోడౌన్‌లను సోమవారం వ్యవసాయశాఖ జేడీ హబీబ్ బాషా తనిఖీ చేశారు. యూరియా, ఎరువుల అక్రమ నిల్వలు, యూరియా ఎటువంటి బిల్లులు లేకుండా రవాణా వంటి చర్యలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట ఏడీ వై.సుబ్బారావు, ఏవో ప్రదీప్‌కుమార్, ధర్మాజీగూడెం ఎస్సై కె.వెంకన్న తదితరులు ఉన్నారు.

కొయ్యలగూడెం: మండల వ్యాప్తంగా ఉన్న హోల్‌సేల్ ఎరువుల దుకాణాలను, సొసైటీలను ఏలూరు జిల్లా వ్యవసాయ అధికారి షేక్ హబీబ్ బాషా, కేఆర్‌పురం సహాయ వ్యవసాయ సంచాలకులు పీజీ బుజ్జిబాబు నేతృత్వంలో సోమవారం విస్తృతంగా తనిఖీ చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కేవీఎస్ పోశారావు, రైతులు పాల్గొన్నారు.

అధికారుల గైర్హాజరుపై ఆగ్రహం

మండల పరిషత సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధుల నిరసన



మండల పరిషత్ సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

పోలవరం రూరల్: మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి మండల స్థాయి అధికారులు పూర్తిగా హాజరు కాకపోవడంపై ప్రజా ప్రతినిధులు ఎవరికి సమస్యలు విజ్ఞప్తి చేయాలంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. పోలవరం మండల పరిషత్ సమావేశం సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ఎంపీపీ సుంకర వెంకటరెడ్డితో సహా, మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సమావేశానికి అధికారులు ఎందుకు హాజరు కాలేదంటూ ఎంపీడీవో సీహెచ్ శ్రీనివాసబాబును ప్రశ్నించారు. అందరికీ సమాచారం ఇచ్చామని, రాని వారిపై ఉన్నతాధికారులకు మెమోలు జారీ చేస్తామని తెలిపారు. సమస్యలు పరిష్కరం కానప్పుడు ఎందుకు సమావేశం అంటూ, సమావేశం నుంచి వాకవుట్ చేస్తామని, సమావేశం నుంచి వెళ్లిపోయేందుకు ప్రయత్నించగా, ఎంపీడీవో హాజరుకాని అధికారుల విషయంపై చర్యలు తీసుకుంటామని, సమస్యలన్నీ కూడా పరిష్కరించేందుకు కృషి చేస్తానని చెప్పడంతో సమావేశానికి ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. పలువురు అధికారులు వారు చేపట్టే పనులపై సమావేశంలో వివరించారు. కొండ్రుకోట పంచాయతీ పరిదిలోని నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని ఎంపీటీసీ మాడే ఆనంద్ సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. సచివాలయాల్లో వీఆర్‌వోలు రైతులకు అందుబాటులో ఉండేలా చూడాలని ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అక్కడే ఉన్న తహసీల్దార్ ఆర్ఎస్‌రాజు మాట్లాడుతూ తప్పనిసరిగా వీఆర్‌వోలు సచివాలయాల్లో ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. మండలంలో యూరియా కొరత లేకుండా చూడాలని, రైతులందరికీ అందేలా అధికారులు ఏర్పాట్లు చేయాలన్నారు. గతంలో కొండవాగుల ఉధృతికి గండ్లు పడిన కాలువ గట్లు మరమ్మతులకు రూ.46 లక్షలతో ప్రతిపాదనలు పంపామని మైనర్ ఇరిగేషన్ డీఈ వరప్రసాద్ తెలిపారు. అయితే కడెమ్మ కాలువ పూడికతీతకు రూ.5 లక్షలు మాత్రమే మంజూరయ్యాయని, మిగిలిన నిధులు మంజూరైన తరువాత పనులు చేపడతామన్నారు. ఈ సమావేశంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చేస్తే చర్యలు తప్పవు



గురుకుల పాఠశాలలో విద్యార్థినులకు అవగాహన కలిగిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి మధుబాబు

చింతలపూడి: బాల్యవివాహాలు, గర్భధారణ వల్ల కలిగే నష్టాలపై చింతలపూడి జూనియర్ సివిల్ జడ్జి సీహెచ్ మధు బాబు బాలికలకు అవగాహన కలిగించారు. సోమవారం నాగిరెడ్డిగూడెం గురుకుల పాఠశాలలో బాల్యవివాహాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. బాల్యవివాహాల వలన ఆరోగ్య సమస్యలతో పాటు తల్లీ బిడ్డ మరణాలు సంభవిస్తున్నాయని చెప్పారు. 18 ఏళ్లు నిండిన తర్వాత మాత్రమే మహిళలు పూర్తి ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. సీఐ టి.క్రాంతి కుమార్, సత్యవతి, ఎంఈవో కిరణ్ బాబు, సోషల్ వర్కర్ అక్బర్ ఆలీ, స్కూల్ ప్రిన్సిపాల్ హేమలత, సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాల వల్ల అనర్థాలపై అవగాహన

మండలంలోని సుబ్బరాజు ఉన్నత ప్రభుత్వ పాఠశాల నందు చైల్డ్ రైట్స్ అడ్వొకేసీ ఫౌండేషన్, క్రాఫ్ ఆధ్వర్యంలో బాల్య వివాహ వ్యతిరేక ప్రచారోద్యమం వీధి నాటక ప్రదర్శన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎస్సై కె సతీష్ కుమార్ బాల్య వివాహాల వలన కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలకు పాల్పడితే జైలు శిక్ష, జరిమానా పడుతుందని హెచ్చరించారు. ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సెక్టార్ సూపర్‌వైజర్ పి లీలకుమారి మాట్లాడుతూ బాల్యవివాహాన్ని చేస్తున్నట్లు తెలిస్తే చైల్డ్ హెల్ప్ లైన్ 1098 వారికి గాని లేదా అంగన్‌వాడీ టీచర్లకు గానీ లేదా 100 పోలీసు వారికి గాని సమాచారాన్ని అందించాలన్నారు.

రోగుల పడిగాపులు



ఏరియా ఆసుపత్రిలో రిపోర్టుల కోసం వేచి ఉన్న రోగులు

జంగారెడ్డిగూడెం: స్థానిక ఏరియా ఆసుపత్రిలో సోమవారం ఓపీ అధికంగా ఉండడంతో రక్తపరీక్షల రిపోర్టుల కోసం రోగులు గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చింది. రోగుల వద్ద రక్త నమూనాలు సేకరించి, ఆసుపత్రిలోని ల్యాబ్‌లో పరీక్షలు నిర్వహించారు. అయితే రోగులు అధికంగా ఉండడంతో ఉదయం 9 గంటలకు వచ్చిన రోగులు మధ్యాహ్నం ఒంటి గంట వరకు రక్తపరీక్షల రిపోర్టులు కోసం ఎదురుచూస్తు ఇబ్బందులు పడ్డారు.